క్లుప్తంగా

63వ వార్డులో ఓటరు జాబితా పరిశీలన



63వ వార్డులో ఓటరు జాబితా పరిశీలనలో పాల్గొన్న బీఎల్‌వోలు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు లోని పలు పోలింగ్‌బూత్‌ల పరిధిలో ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. 162 పోలింగ్‌బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాపై బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. మృతి చెందిన, వలస వెళ్లిన, వివాహమై వేరే ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లను గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపునకు పక్కా ఆధారాలు తీసుకున్నారు. కార్యక్రమంలో రాంబాబు, రమణమూర్తి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న కార్పొరేటర్ పీవీ



అంత్యక్రియలో పాల్గొన్న కార్పొరేటర్ పి.వి.సురేష్

మల్కాపురం: కోరమాండల్ పరిసర ప్రాంతాల్లో యాచక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కోమటి అప్పలనాయుడు మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. రక్త సంబంధీకులు ఉన్నా పట్టించుకోకపోవడంతో విషయం తెలుసుకున్న 60వ వార్డు కార్పొరేటర్ మానవత్వం చాటుకున్నారు. యాచకుడి మృతి సమాచారాన్ని పోలీసులకు అందించి, వారి సమక్షంలో తన సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు.గతంలో కూడా పి.వి. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టారు. దీంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు ఆయన్ను అభినందిస్తున్నారు.

పరిశ్రమల్లో భద్రతకు ప్రాధాన్యం



విజేతకు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్‌వర్మ

పరవాడ: పర్యావరణ, సామాజిక పాలన దక్షతను పెంపొందించుకోవడానికి పరిశ్రమల యాజమాన్యాలు కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ సూచించారు. పరవాడ ఫార్మాసిటీలో ఎంఏఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 53వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రత ప్రాముఖ్యాన్ని వివరించారు. ఎంఏఎస్‌ఆర్‌ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు మాట్లాడుతూ ఏడాది కాలంలో ఫార్మాసిటీలో వివిధ శిక్షణ కార్యక్రమాలు, ఫార్మా ఎగ్జిబిషన్, ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్‌తో పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.వి.వి.ఎస్.నారాయణలకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఎస్.రావు, కేఆర్‌ఎస్ ఫార్మా రామ్మోహన్‌రావు, మైలాన్ రామరాజు, సునీల్, గ్లాండ్ ఫార్మా గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకీ సేవ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీదేవి భూదేవి సమేత తిరుమలేశుని పల్లకీ సేవ నేత్రపర్వంగా జరిగింది. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

కొండవాలు... అభివృద్ధి పరవళ్లు

నాడు: శిథిలమైన మెట్ల మార్గాలు.. సందుల్లో పిచ్చి మొక్కలు.. తాగునీటికి కటకట.. వర్షం కురిస్తే నిద్రలేని రాత్రులు.. ఇక ఏ చిన్న శుభ కార్యం చేసుకోవాలన్నా వేదిక లేక అవస్థలు.. ఇదీ కొండవాల్లో ప్రాంతాల్లో పరిస్థితి.

నేడు: కొండవాలు ప్రాంతాలు ప్రగతి బాట పట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి పనులు చేపట్టింది. శిథిలమైన మెట్ల మార్గాలు తొలగించి కొత్తగా నిర్మించింది. అంతర్గత రహదారులు అభివృద్ధి చేసింది. వర్షాలకు కొండప్రాంత మట్టి కరిగి పోకుండా రక్షణ గోడలు కట్టింది. కొండవాలు ప్రాంతాలకు భరోసా కల్పించింది.

- ప్రగతి పథంలో 62వ వార్డు
- సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు
- రోడ్లు, కాలువలు, రక్షణగోడలు, సామాజిక భవనాల నిర్మాణం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డులోఅభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. ఇది చూసిన వార్డు ప్రజలు పాలకుల పనితీరుపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టాలు తీర్చిన వారికి అండగా ఉంటామని చెబుతున్నారు.టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వార్డులో చాలా వరకూ కొండవాలు ప్రాంతాలు ఉండడంతో వానొచ్చినా, పెద్ద గాలేసినా కొండవాలు ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు ఉండేది కాదు. కానీ 2019 తర్వాత ఈ ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా మారింది. కోట్ల రూపాయలతో వార్డులో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు సమకూర్చడంతో ప్రజలు ఇబ్బందులు తొలగాయి. వీధుల్లో సైతం అంతర్గత రోడ్లు అద్దంలా మెరుస్తున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహర్దశ

గత పాలకులు వార్డులో ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు నిత్యం యాతన పడేవారు. ముఖ్యంగా వార్డులోని ప్రధాన గెడ్డ నేవీ క్వార్టర్స్ కింద నుంచి వెళ్తుండడంతో వర్షం వచ్చిన ప్రతీసారి గెడ్డ పొంగి చుట్ట పక్కల ప్రాంతాలు మురుగునీరు, చెత్తాచెదారంతో కంపుకొట్టేవి. కానీ ఇటీవల గెడ్డను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడంతో పాటు గెడ్డకు ఇరువైపులా ఇనుప చువ్వలు అమర్చి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వార్డు పరిధిలోని అచ్చెంనాయుడుతోటలో టిడ్కో గృహాలు ప్రారంభించడంతో పేదప్రజల సొంతింటి కల నెరవేరింది.



నాడు / నేడు

శిథిలమైన రోడ్లు

దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో నిర్మించిన మెట్ల మార్గం



నాడు / నేడు

దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో దుస్థితి

62వ వార్డులో కొండవాలు ప్రాంతాల్లో రోడ్డు

62వ వార్డులో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసిన నిధుల వివరాలు

రోడ్ల కోసం : రూ. 83.88 లక్షలు
డ్రెయిన్ల నిర్మాణం : రూ. 1.70 కోట్లు
సామాజిక భవనాల నిర్మాణం : రూ. 1.32 కోట్లు
రక్షణ గోడలనిర్మాణం: రూ. 23 లక్షలు
రోడ్డు కమ్ డ్రైన్స్ కోసం: రూ.1.06 కోట్లు
టాయిలెట్ల నిర్మాణం : రూ. 32 లక్షలు
పార్కుల కోసం : రూ. 10 లక్షలు

వసతులు కల్పించారు



గతంలో మా ఏరియాలో రోడ్లు, కాలువలు అస్తవ్యస్తంగా ఉండేవి. దీంతో రోడ్లపై ప్రయాణించాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ సమస్య తీరింది. ఈ ఐదేళ్లలో కాలనీలో నూతన రోడ్లు, కాలువలు, డ్రెయిన్లు నిర్మించడంతో మా ప్రాంత సమస్యలు తొలగాయి. ఎన్నడూలేని విధంగా మా ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– దాసరి రవి, మల్కాపురం

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి



నేను ఇక్కడే పుట్టి, పెరిగాను. నా చిన్నతనం నుంచి చూస్తున్నాను. మా ప్రాంతం విశాఖ నగర పరిధిలో ఉన్నప్పటికి సదుపాయాలు మాత్రం ఉండేవి కావు. కానీ 2019 తర్వాత మా ప్రాంత రూపురేఖలే మారిపోయాయి. పాఠశాలలు అభివృద్ధి చేశారు. రోడ్లు, రక్షణ గోడలు, డ్రెయిన్లు, సామాజిక భవనాలు కట్టారు. ఇటువంటి పాలకులు మళ్లీ అధికారంలోకి వస్తే మాలాంటి ఎన్నో ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయి.

– ఆడారి నాగరాజు, ప్రకాష్‌నగర్

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల అధికారి హుస్సేన్ సాహెబ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో హుస్సేన్ సాహెబ్, ఏసీపీ నరసింహమూర్తి

కంచరపాలెం: నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని ఎన్నికల అధికారి (ఆర్‌వో) హుస్సేన్ సాహెబ్ కోరారు. జ్ఞానాపురం జోన్-5 జోనల్ కార్యాలయం సమావేశ మందిరంలో పోలీసులకు, రాజకీయ ప్రతినిధులకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్ఞానాపురం, గోపాలపట్నం, జింక్ ప్రాంతాల కూడళ్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌వీటీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలు నియోజకవర్గంలో పర్యటిస్తూ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ బృందాలు వెండి, బంగారం, నగదు, గంజాయి, మద్యం, మాదకద్రవ్యాలు తదితర వాటిని తరలించేవారిపై చర్యలు తీసుకుంటాయన్నారు. దీనికి సంబంధించి పోలీసులు సింగిల్ విండో సిస్టమ్ కింద ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆర్‌వో కార్యాలయంలో నిరంతరం అందుబాటులో ఉండాలని కోరారు. 85 సంవత్సరాలు దాటిన వృద్ధులను బీఎల్‌వో గుర్తించి, వారి ఇంటి వద్దకే ఫారం 12డీ అందించి తిరిగి తీసుకుంటారన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళి పాటించాలని కోరారు.

అనుమతులు తప్పనిసరి

ఏసీపీ ఎ.నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రచారాలు, ర్యాలీలు, వాహనాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, గాజువాక ములగాడ, గోపాలపట్నం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు స్టేషన్లకు సంబంధించిన సీఐలు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జోరుగా వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



మల్కాపురంలో పాల్గొన్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

మల్కాపురం: ఎన్నికల సమీపిస్తున్న వేళ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆయా ప్రాంతాల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వ పాలనలో అందించిన సంక్షేమాన్ని వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మల్కాపురం పల్లివీధి,గొల్లవీధిలో ఆయా ప్రాంతాల గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.అలాగే 59,58,60వ వార్డు పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వైభవంగా పైడిమాంబ జాతర



అమ్మవారి సన్నిధిలో ఆడారి ఆనంద్



ఆలయంలో భక్తుల సందడి

కంచరపాలెం: రామ్మూర్తిపంతులపేట వాసుల ఆరాధ్య దైవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ పరిసరాల్లో భారీ సెట్టింగ్‌లు, విద్యుత్ అలంకరణ కనువిందు చేశాయి. అమ్మవారి ప్రతిమలతో రైల్వే గేటు వద్ద గల మూలవిరాట్ నుంచి తిరువీధి నిర్వహించారు. సుమారు 298 ఘటాలు మూలవిరాట్ వద్ద నుంచి బయల్దేరాయి. కోలాటాలు, తప్పెటగుళ్లు, నేలవేషాల నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. అనంతరం ప్రధాన ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ, ఉత్తర నియోజకవర్గ అభ్యర్థులు ఆడారి ఆనంద్‌కుమార్, కేకే రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు దాడి గోవింద్ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఏటీఆర్ ట్రస్టు సభ్యులు భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పైడిమాంబ టాటా ఏస్ సంఘం సభ్యులు వి.పైడిరాజు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం



62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడంతో పాటు రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు అన్నారు. వార్డు లోని ప్రకాష్‌నగర్ పోలింగ్ బూత్ 120 పరిధిలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి గడప గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు గలగళ్ల లక్ష్మణరావు, వీరమణి, నారాయణ, శంకరరావు, వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి మృతి



శ్రీరామ్(ఫైల్)

గోపాలపట్నం: తండ్రి బైక్ కొనలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కళింగనగర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి మాధవధార కళింగనగర్‌కు చెందిన పప్పు శ్రీరామ్(18) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. శ్రీరామ్ ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బైక్ కావాలని ఇంట్లో ఒత్తిడి చేస్తున్నాడు. మైనర్లు ద్విచక్ర వాహనం నడపరాదని తండ్రి శ్రీను చెప్పినా వినిపించుకులేదు. దీంతో ఉదయం ఎవరి పనులకు వారు వెళ్లి పోయిన తర్వాత మధ్యాహ్నం ఫ్యాన్ హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారమందించారు. స్థానికుల సాయంతో కిందకి దించి సమీప ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు తెలపడంతో ఇంటికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 30న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

పేదల మోములో చిరునవ్వు కోసం..

- జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్
- 58వ వార్డులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



గజమాలతో ఆనంద్‌కుమార్‌ను స్వాగతిస్తున్న ఎదురవానిపాలెం గ్రామస్తులు



సీఎం జగన్ పాలనలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతీ ఇంటా సంక్షేమ వెలుగులు నిండాయని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఆ కాంతులు పేదల మోములో ప్రతిఫలించాయని, అవి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ గెలిపించుకుందామని అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు ఎదురవానిపాలెంలో మంగళవారం సాయంత్రం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆడారికి ఎదురవానిపాలెం ప్రాంతవాసులు ఘనస్వాగతం పలికి, గజమాల వేసి హారతులు పట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆడారి మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేసిన జగన్‌మోహన్‌రెడ్డి వంటి ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలోకి రావాలని అనుకుంటున్నారా.. లేదా వేల కోట్ల స్కామ్‌లు చేసి, నిరుపేదల కష్టాలను పక్కన పెట్టి, ధనికులకు పెద్దపీట వేసే చంద్రబాబునాయుడు వంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావాలనుకుంటున్నారా?' అని ప్రజలను అడిగారు. దాంతో వారు 'మాటపై నిలబడి, సుపరిపాలన అందించే జగనే కావాలి' అని చెప్పడంతో వారందరికీ ఆనంద్‌కుమార్ కరచాలనం ఇచ్చి అభినందించారు.

జగనన్నకే మా ఓటు

ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆడారి ఆనంద్‌కుమార్ ప్రతీ గడపకు వెళ్లి 'సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా? ఆ పథకాలతో మీ కుటుంబం ఆనందంగా ఉందా? పథకాలు అందిన తర్వాత ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది' అని అడిగారు. దాంతో వారు గతంలో పింఛన్ కావాలంటే పడిగాపులు కాసేవారమని, అలాగే ఏ సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని తెలిపారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. నేరుగా ఇంటికే సేవలు అందుతున్నాయని, జగన్ బాబుకే తమ ఓటు అని, ఆయన్ను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి, కార్పొరేటర్ లావణ్య, పార్టీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు (పొడుగు రాజు), క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, మహిళా నాయకురాలు తోనంగి వెంకటరమణి యాదవ్, మళ్ల ధనలత, చుక్క వరలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, ఎదుర అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని పోలీసుల సమక్షంలో తండ్రికి అప్పగిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గాంధీజీవీధి ప్రాంతానికి చెందిన ఏడేళ్ల బాలుడు తన ఇంటి వద్ద ఆడుకుంటూ దారి తప్పాడు. మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో మంగళవారం సంచరించడంతో ఆ బాలుడుని చూసిన పాదచారులు మల్కాపురం పోలీసులకు అప్పగించారు. వారు సోషల్ మీడియా ద్వారా బాలుడు ఆచూకీ తెలిసిన వారు తల్లిదండ్రుల వివరాలు చెప్పాలని కోరారు. దీంతో ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బాలుడి ఆచూకీ కోసం ఆరా తీశారు. మల్కాపురం గాంధీజీవీధి అని తెలుసుకుని అక్కడకు వెళ్లి ఆ బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.దీంతో వారు స్టేషన్‌కు వచ్చి తప్పిపోయిన వారి బాలుడిని ఇంటికి తీసుకువెళ్లారు.

జగన్ అంటే భరోసా

- మాట ఇస్తే ఎంతటి కష్టమైనా నిలబడతాడనే నమ్మకం
- ఆయన పాలనను మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరికలు
- పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్



పార్టీలో చేరిన వారితో ఆడారి ఆనంద్‌కుమార్, పీలా ఉమారాణి

మల్కాపురం: 'జగన్ అంటే ప్రజలకు ఓ నమ్మకం. మాట ఇచ్చారు అంటే ఎంతటి కష్టమైనా నిలబడతారనే భరోసా. అందుకే అంతటి ప్రజాదరణ' అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఆయన పాలనను మెచ్చే వైఎస్సార్‌సీపీలో చేరికలు పెరిగాయన్నారు. 58వ వార్డు ఎదురవానిపాలెం గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువత మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆనంద్‌కుమార్, పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పీలా ఉమారాణి కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఇదే మాదిరిగా ఆయన వెంట నిలిచి, రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పార్టీని నమ్ముకుని వచ్చిన ప్రతీ కార్యకర్తకు తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

జనమే జగనన్న బలం : '14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేశానని, తన వల్లనే ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాయి అని చెప్పుకొని తిరిగే చంద్రబాబు సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఎందుకు భయపడుతున్నారు.. ఇతర పార్టీలతో ఎందుకు పొత్తులు పెట్టుకుంటున్నారు' అనేది ప్రజలు గ్రహించారన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి తన సుపరిపాలన ద్వారా ప్రతీ పేదవాడి కన్నీటిని తుడిచారన్నారు. తాను ప్రజలకు మేలు చేశానని.. ఆ ప్రజలే వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తారనే నమ్మకంతోనే జగనన్న ఒంటరిగా బరిలో నిలుస్తున్నారన్నారు. చంద్రబాబు వంచనతో కూడిన పాలన అందించబట్టే ప్రజలు తనను నమ్మడం లేదని పలు పార్టీలతో పొత్తులు పెట్టుకుని ముందుకు వస్తున్నారని విమర్శించారు. జగనన్న బలం జనమేనన్నారు. సంక్షేమప్రదాతను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లావణ్య, వార్డు అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్‌రాజు, తోనంగి వెంకటరమణియాదవ్, క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో కార్మికులకు తీరని నష్టం కలుగుతుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1139వ రోజు, మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా భాగస్వామ్యంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.